నేడు వైఎస్.జగన్ జిల్లాకు రాక

ప్రజాశక్తి -పులివెందుల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్. జగన్ జిల్లాలో పర్యటించనున్నట్లు వ్యక్తిగత కార్యదర్శి నాగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.50 గంటలకు గుంటూరు జిజిహెచ్‌కు చేరుకుని అక్కడ చికిత్స పొందుతున్న బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం వైఎస్ఆర్ జిల్లా బద్వేలు చేరుకుని ప్రేమోన్మాది దాడిలో గాయపడి మృతిచెందిన దస్తగిరమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు పులివెందుల చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు పులివెందులలో ప్రజలకు కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ పలు కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు.

చర్చించేనా!

- రబీపై సమగ్ర చర్చ అవసరం
- ప్రశ్నార్థకంగా ఉక్కు పరిశ్రమ పనులు
- 'కొప్పర్తి' ఎంఎస్ఎంఇ నిలిచేనా!
- నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించడంపై సందేహం నెలకొంది. బుధవారం జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి చైర్మన్ అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. రబీ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న ఎరువులు, విత్తన సబ్సిడీ కోత, అన్నదాత సుఖీభవ నిధుల జమ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయం, పాడి గ్రామీణ విద్య వైద్య రంగాలు ఎదుర్కొంటున్న ప్రతి కూలతలు జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీలో ఐసి సేవలు, వైద్యనిపుణులు, సిబ్బంది నియామకాలపై దృష్టి సారించాలి. ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణ పనులు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే తరహాలో ఉక్కు పరిశ్రమ పనులు, కొప్పర్తిలో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కు తరలింపు చర్చించాల్సి ఉంది. టెక్నాలజీ పార్కుపై అధికార పార్టీని నిలదీయాల్సి ఉంది. అనంతరం పైప్‌లైన్ పనుల పురోగతి ఏదశలో ఉందో ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటి వరకు అధికార టిడిపి నుంచి పాలకపక్ష తప్పిదాలను నిలదీసే అవకాశాలు సన్నగిల్లిన నేపథ్యంలో సమగ్రచర్చ దేవతావస్త్రంగా మారింది.

రబీ సీజన్‌లో శనగ విత్తన సబ్సిడీ కుదింపు నిలదీయాల్సి ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, ఫీజురియింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల నిధుల జమ వంటి పలు అంశాలపై సమగ్రంగా చర్చించాల్సి ఉంది. కెసి కెనాల్ శివారు వరకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాల్సి ఉంది. కడప కార్పొరేషన్‌లో స్ట్రామ్‌డ్రెయిన్ పనుల్లో పట్టులను ఎక్కించడం హామీ. అన్నమయ్య, గండికోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదుకుంటామని హామీ నిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కొరవడింది. పింఛా, ఎల్ఎస్‌పి గేట్లకు మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీల పరిష్కారం, యురేనియం-పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియడం లేదు. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనుల్లో పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. ఐదేళ్ల సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం మారి టిడిపి, జనసేన, బిజెపి కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతిపై సందేహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదు. గతేడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు ఎటువంటి పురోగతి కనిపించలేదు. కొప్పర్తికి రూ.150 కోట్ల నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఫలితంగా యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై సమగ్రమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

బీడీ, సిగార్ ఉత్పత్తులపై

జిఎస్‌టిని రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

బీడీ, సిగార్ ఉత్పత్తుల పైన జిఎస్‌టిని రద్దు చేయాలని ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. బీడీ కార్మికుల స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా జి.ఓబులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీడీ చట్టం, బీడీ కార్మిక సంక్షేమ చట్టం రద్దు చేయడం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందిగా ఉన్న కార్మికులు పిఎఫ్, ఇఎస్ఐ నోచుకోవడం లేదని తెలిపారు. ఈ పనిలో క్షయ, రక్తహీనత వంటి వ్యాధులు పనిచేయడం ద్వారా తగ్గిన రోగాలతో నడుం, కీళ్ల నొప్పులు వచ్చి బాధపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో బీడీ సంక్షేమ చట్టం కింద కార్మికులకు వైద్యం, ఇళ్ల స్థలాలు, పిల్లల స్కాలర్‌షిప్‌లు, వృద్ధాప్య పెన్షన్, గృహ నిర్మాణం మొదలగు సౌకర్యాలు అన్ని కార్మికులు ఉండేవని చెప్పారు. ప్రస్తుతం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దేశవ్యాప్తంగా వేతన పాలసీ ఉండాలని, కార్మిక సంక్షేమ చట్టాలు పునరుద్ధరించాలని నవంబర్, డిసెంబర్‌లో పెద్ద ఎత్తున బీడీ కార్మికుల్లో ప్రచారం చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ నుంచి జిఎస్‌టి వసూలు చేసిన దానిలోనుంచి బీడీ కార్మికుల సంక్షేమ నిధి కింద కొంత మొత్తాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. యథావిధిగా బీడీ కార్మికులకు సంక్షేమ నిధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున బీడీ కార్మికులు ఉద్యమిస్తారని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, పెన్షనర్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి, కర్నూల్, నెల్లూరు నాయకులు అబ్దుల్ దేశాయ్, షబ్బీర్, అన్నమయ్య నుంచి రామాంజనేయులు, అనంతపురం నుంచి జగన్ మోహనరెడ్డి, కడప నుంచి జమీలా, రియుజు, బీడి కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి. ఓబులు

బిటి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. మంగళవారం నగరంలోని సంజన్న సర్కిల్ నుంచి మాసాపేట రోడ్డు వరకు నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి ఎమ్మెల్యే మాధవిని, శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాటలు చెప్పి చేతల్లో చూపలేకపోయిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం 3 నెలలలోపు ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. ఇదే మాదిరి కడప నగరంలోని అన్ని ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భారీ స్కోరు సాధించిన కడప

ప్రజాశక్తి - కడప

ఎసిఎ అండర్ -14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, కడప జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 316 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని లోకేష్ 53, ఫైజాన్ 73, ప్రశాంత్ 77 నాట్ అవుట్ పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ఆశీస్సు రెడ్డి 2, మౌలా 2 వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో వెస్ట్ గోదావరి, విశాఖపట్నం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74.3 ఓవర్లలో 112 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నారాయణ 45, నాగ గణేష్ 25 పరుగులు చేశారు. విశాఖపట్నం జట్టులోని మనోజ్ నాయుడు 4 చాణిక్య సాయి మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 22.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 82 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ రెడ్డి 43 నాట్ అవుట్, అక్షిత్ రెడ్డి 35 నాట్ అవుట్ పరుగులు చేశారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు, ఈస్ట్ గోదావరి జిల్లా మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 78.5 ఓవర్లలో 162 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 72 పరుగులు చేశాడు. ఈస్ట్ గోదావరి జట్టులోని రేవంత్ ఐదు, షాహిద్ రెండు, తమన్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 17.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది.

విభజన హామీలను అమలు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈనెల 29,30లలో నిర్వహించే డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను యోగివేమన యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశాలకు అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎ.ఎ.రహీమ్, ముఖ్య అతిథి గా హాజరు అవుతున్నారన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి రాష్ట్ర నాయకత్వం సమావేశాలకు హాజరు అవుతున్నారని తెలిపారు. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో కడప ఉక్కు, రాష్ట్ర విభజన హామీలు అమలే అజెండాగా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్, నవీన్,ప్రతాప్ పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్'పై శ్రద్ధ పెట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జి. చంద్రశేఖర్

ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శ్రద్ధ పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు, అమ్మకు వందనం, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, దీపం పథకం కింద ఇస్తున్న మూడు సిలిండర్ల కూడా స్పష్టత లేదని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుక విధానంలో కూడా ఆచరణలో చాలా గందరగోళం ఉందని, ఎన్నికల ముందు నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, ఛార్జీల భారం వెయ్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలు ప్రజల పైన విద్యుత్ భారాలు వేస్తుందని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందారని, ఇప్పుడు బాబు కూడా అదే బాటలోనే పయనిస్తున్నారన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం గతంలో దీక్షలు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు కేంద్రంలో ఎన్‌డిఎలో భాగస్వామ్యం అయినా కూడా వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పరిశ్రమలు తీసుకురావడంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం జిల్లా మహాసభలు డిసెంబర్ 14,15 తేదీలలో నగరంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. మహాసభలలో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కోసం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, నికర జలాలు, పరిశ్రమల కోసం జిల్లా మహాసభలలో చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా ర్యాలీ, ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. జిల్లా మహాసభలు జయప్రదానికి సహాయ, సహకారాలు అందించాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్ జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలపై గ్రామసభ

ప్రజాశక్తి - సిద్ధవటం : మండలంలోని ఉప్పరపల్లె వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రంలో మంగళవారం రీసర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మురాషావలి మాటాడుతూ సిద్ధవటం మండలంలో 18 రెవెన్యూ గ్రామాలలో నాలుగు గ్రామాలైన ఎస్. రాజంపేట, మందపల్లె, జంగాలపల్లె, శాఖరాజు పల్లె రెవెన్యూ గ్రామాలలో గత ప్రభుత్వంలో రీ సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. మిగిలిన గ్రామాలోనూ నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నాలుగు అంశాలపై అర్జీలను తీసుకోవాలని, ప్రతి అర్జీకి రసీదు ఇస్తారని పేర్కొన్నారు. ప్రతి అర్జీని కంప్యూటర్లలో నిక్షిప్తం చేసి పరిష్కారం చూపు తామ న్నారు. గ్రామ సర్వేయర్ మాట్లాడుతూ పట్టాదారుని పేరు, జాయింట్ ఎల్పిఎం, ఏరియా విస్తీర్ణం, భాగ పరిష్కారాల లాంటి సమస్యలను పరిష్కార మార్గం చూపి స్తామన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ శివశంకర్, పంచాయతీ సెక్రటరీ సంధ్య, రైతులు పాల్గొన్నారు.

రేపు పెన్షన్, జిపిఎఫ్ అదాలత్

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సంబంధించి జిపిఎఫ్, పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల24న ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని సభాభవనంలో పెన్షన్, జిపిఎఫ్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ఖజానాశాఖ, ఉపసంచాలకులు ఎమ్.ఎస్. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై పెన్షన్, జిపిఎఫ్‌లలో ఏవైనా సమస్యలు తెలియజేస్తే అక్కడికక్కడే సత్వరమే పరిష్కరిస్తారన్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు : విద్యార్థినికి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడిన విగ్నేశ్వర్‌పై సంబంధిత అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం బద్వేలు మండలం కార్యదర్శి పి.రవిచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా నేరస్తులకు కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బద్వేలు మండల కమిటీ సభ్యులు వై.తిరుపల్ రెడ్డి, డి. రామసుబ్బమ్మ, జి. వెంకటయ్యపాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరమే

ప్రజాశక్తి-కాశినాయన : ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమని ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. ఎపి మోడల్ పాఠశాలలోని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎమ్. రాజరామ్ సౌత్ ఇండియా అండర్ -19లో నేషనల్ లెవల్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికు వెళ్లడం గొప్పవిషయమన్నారు. క్రికెట్‌లో మంచి స్థానం సంపాదించడం సంతోషంగా ఉందన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన రాజారాం ఇంత గొప్ప స్థాయిలో క్రికెట్ ఆడుతున్నాడంటే తమకు, పాఠశాలకు గొప్ప ఖ్యాతీ తెచ్చినట్లుగా ఉందన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఈగల్ డిస్టిలరీస్‌లో సిఐడి తనిఖీలు

నాలుగు బృందాలుగా అధికారులు పరిశీలన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగర శివారులోని మద్యం ఉత్పత్తి పరిశ్రమ ఈగల్ డిస్టలరీస్ కార్యకలాపాలపై సిఐడి అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నాలుగు వాహనాల్లో వచ్చిన అధికారుల బృందం గత, ప్రస్తుత మద్యం ఉత్పత్తుల వివరాలు, పలు రకాల మద్యం ధరల స్థితిగతులు సహా ఇతర వివరాలతో కూడిన రికార్డులను తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి సమాచారం బయటికి ఇవ్వకుండా గోప్యంగా ఎక్సైజ్ అధికారుల పేరుతో తనిఖీలు చేస్తుండడం గమనార్హం. ఈగల్ డిస్టిలరీస్‌లో ఏమిశోధించారో బయటికి సమాచారం పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి -కమలాపురం టౌన్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ ఎస్.కె. రోషన్ పేర్కొన్నారు. మంగళశారం నెహ్రూ యువ కేంద్ర కడప శాఖ ఆదేశాల మేరకు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాల నిర్మూలన' పై సిఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిఐతోపాటు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, హోమియోపతి వైద్యులు డాక్టర్ షాకీర్ హుస్సేన్, ప్రిన్సిపల్ డాక్టర్ వినోద్‌కుమార్, మదర్ థెరీసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ హాజయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ జ్ఞానాన్ని సంపాదించి, వారు విజ్ఞానమయమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తు దిశగా పయనించాలని సూచించారు. వ్యక్తిత్వానికి ఉపయోగపడే పాజిటివ్ థింకింగ్ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు దరిచేరితే కనీసం మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా తప్పదని విద్యార్థులకు గుర్తు చేశారు. యువత మత్తు పదార్థాల వల్ల జరిగే తీవ్ర దుష్ప్రభావాలను తెలుసుకొని వాటి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యకక్రమంలో కార్యక్రమంలో పరీక్ష నియంత్రణ ఆధికారి డాక్టర్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మయ్య, అయ్యవారు,అశోక్ కుమార్, మాలకొండయ్య, జిల్లా డి-అడిక్షన్ సెంటర్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలల్లో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - కడప

సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మంగళవారం కడప నగరంలోని బధిరుల ప్రత్యేక పాఠశాలలను, వృద్ధాశ్రమాలను, ప్రభుత్వ బాలురగృహాలను సందర్శించారు. అక్కడ వసతులను పరిశీలించారు. కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహొ, ప్రభుత్వ పరిశీలన గృహం, చెన్నూరు బస్టాండ్ సమీపంలోని మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, ఆల్‌సిఫా మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ఇంకా పలు పాఠశాలను సందర్శించి అక్కడి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మొదలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ అందుల పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్'కు ఆటంకాలు తొలగించాలి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న మధురెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ యువ నేత వెన్నపూస మధురెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మానస పుత్రిక ఫీజు రీయింబర్స్‌మెంట్ అని అన్నారు. మహానేత హయాంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఒక ప్రతిష్టాత్మక పథకం ఇది అని, ఎందరో పేద బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపిందని అన్నారు. తరువాత ఆయన కుమారుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని నీరు కార్చారని వాపోయారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ. 3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటు అన్నారు. దోచుకొని దాచుకోవడం మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల సంక్షేమం మీద పెట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పక్కాగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయించాలని కోరారు.

తెలుగుభాషా నైపుణ్యాన్ని పెంపొందించుకుందాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప బాలోత్సవం పేరుతో, బాలల దినోత్సవం పురస్కరించుకుని నవంబర్ 9న నిర్వహించే బాలోత్సవంలో తెలుగుభాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని డిఇఒ అనురాధ తెలిపారు. మంగళవారం డిఇఒ కార్యాలయంలో కడప బాలోత్సవం పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడప బాలోత్సవం జిల్లా అధ్యక్షులు జి. గోపాల్ మాట్లాడుతూ బాలల్లో సృజాత్మక శక్తిని వెలికి తీయటానికి కడప బాలోత్సవం పేరుతో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ 14 బాలల దినోత్సవం పురస్కరించుకుని 6,7,8 తరగతుల (జూనియర్స్)విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన పోటీలలో 'ట్రాఫిక్ సమస్యలు, పరిష్కారాలు, పద్యాలాపనలో వేమన, సుమతి శతక పద్యాలు', సీనియర్స్ విభాగము 9,10 తరగతులకు వ్యాసరచన లో 'మత్తు పదార్థాలు - యువతపై ప్రభావం, నివారణోపాయాలు', నాటక రంగ పద్యాలలో 'శ్రీకృష్ణ రాయబారం, సత్య హరిశ్చంద్ర నాటికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు 15న బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డిఇఒ నాగముని రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లారెడ్డి, బాలోత్సవ కమిటీ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సుందరయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యుటిఎఫ్‌ను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలో ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ యుటిఎఫ్‌ను అందరం బలోపేతం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు , జి. బాల ఓబయ్య అన్నారు. ఇటీవల కడప స్వర్ణోత్సవ మహాసభలో మండల నూతన అధ్యక్షునిగా ఎన్నుకున్న సందర్భంగా మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. కొన్నేళ్ల నుంచి మండలంలో యుటిఎఫ్ లేకపోవడంతో ఉపాధ్యాయులు సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. కొంతమంది వారికి తోచిన రీతిలో ఉద్యమాలు చేసుకుంటూ వచ్చారు. ప్రస్తుతం యుటిఎఫ్ తీసుకున్న నిర్ణయాలు ఉపాధ్యాయులకు అత్యంత కీలకమైనవని, ఉద్యమాలు చేసి ఉపాధ్యాయుల సమస్యలను సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

అష్ఫాఖుల్లాఖాన్ స్ఫూర్తితో పోరాడుదాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేశం కోసం చిన్న వయసులోనే అమరుడైన అష్ఫాఖుల్లాఖాన్ జీవితం స్ఫూర్తితో ప్రతి ఒక్కరం ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందామని, బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. అష్ఫాఖుల్లాఖాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఐటిఐ కళాశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం ప్రయివేట్ పరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచేస్తుందని తెలిపారు. విభజన హామీలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వహిస్తుందని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుండా తాచ్చారం చేస్తున్నదని చెప్పారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాటు అయితే వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

సమాచార హక్కు చట్టానికి తూట్లు

- సెక్షన్ 4 (1) బి అమలయ్యేనా?

ప్రజాశక్తి - సిద్ధవటం

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వ్యవసాశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమ వుతున్నారు. మండల కేంద్రమైన సిద్ధవటం మండల తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం - 2005 చట్టానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలందరికీ తెలియ పరిచేందుకు సమాచార హక్కు చట్టం సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని సెక్షన్ 4(1) బి నిబంధన తెలుపుతుంది. ఆ నిబంధనలేవి సిద్ధవటం తహశీల్దార్ కార్యాలయం పాటించడం లేదని పలువురు వాపోతున్నారు. సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులో పౌర సమాచార అధికారి పేరు, చరవాణి నెంబర్ లేకపోవడం, సహాయ పౌర సమాచార అధికారి పేరు తప్పుగా ఉండడం, చరవాణి నెంబర్ 10 అంకెలకు బదులుగా 9 అంకెలను పొందుపరచడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అప్పిలేట్ అధికారి పేరు తప్పుగా ఉండి, చరవాణి నెంబర్ తప్పుగా ఉండటంపై ఇక్కడ సమాచార హక్కు చట్టం 2005 అమలు పైన అనేక అనుమానాలు లేకపోలేదు. అంతేకాకుండా సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు కూడా పొంతన లేని సమాచారం ఇస్తూ అయిన వారికి కంచంలో కాని వారికి 30 రోజుల గడువు తీరినా సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొన్ని సమాచార హక్కు దరఖాస్తులకు ఏకంగా థర్డ్ పార్టీ కింద సమాచారం ఇవ్వకుండా సమాచార హక్కు చట్టాన్ని ధిక్కరిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులకు కొమ్ముకాస్తున్నారని కొందరు బహిరంగంగానే విమర్శలను గుప్పి స్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులో తప్పులు లేకుండా సవరణ చేసి సమాచార హక్కు దరఖాస్తుదారులకు కోరిన సమాచారాన్ని ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సమాచార హక్కు చట్టం 2005
సెక్షన్ 4 (1) బి ప్రకారం

పౌర సమాచార అధికారి :
డిప్యూటీ తహశీల్దారు
ఫోన్ :

సహాయ పౌర సమాచార అధికారి : శ్రీ జి.యస్. చంద్రశేఖర్ బాబు
సీనియర్ సహాయకులు
ఫోన్ : 850816391

అప్పిలేట్ అధికారి : శ్రీ జి.ఆర్. మధుసూదన్, బి.టెక్
రెవెన్యూ డివిజనల్ అధికారి
వై.యస్.ఆర్ కడప జిల్లా
ఫోన్ : 9849904177

తహశీల్దారు సిద్ధవటం

పౌర సమాచార అధికారి పేరులేని బోర్డు

పిబిసిలోకి భారీగా చేరిన వరద నీరు

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని పార్నపల్లె పెంచికల బసిరెడ్డి జలాశయంలోకి మంగళవారం ఎగువ కురుస్తున్న వర్షానికి 5000 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు పిబిసి ఇఇ కిరణ్ తెలిపారు. సత్యసాయి జిల్లాలో అప్రచెరువు, ధర్మవరం గొట్లలూరు చెరువు భారీగా ప్రవహిస్తున్నాయన్నారు. వరద నీరు ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్ లో 7.65 టిఎంసి నీరు నిల్వ ఉందన్నారు.

సంచార పన్ను వసూలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపాలిటీలో సంచార పన్ను వసూలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఉదయం ఆయన పురపాలక సంఘంలో వంద శాతం ఆస్తి పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా సంచార పన్ను వసూలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు కూడా సకాలంలో పురపాలక సంఘానికి చెల్లించవలసిన అన్ని రకాల పన్నులను చెల్లించాలన్నారు. పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మనికుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానానికి వయసు పరిమితి కాదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానానికి వయసు పరిమితి కాదని స్నేహిత అమృత హస్త సేవా సమితి అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. పట్టణంలోని విశ్వభారతి వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు కర్ణ లక్ష్మీ నారాయణమ్మ మరణించడంతో ఆమె కుమారులు జయవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లీలాధరరెడ్డి, కుమార్తె లక్ష్మీదేవి, కోడళ్ళు జ్యోతి, సుదేష్ణ నేత్రదానానికి అంగీకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారమివ్వడంతో మంగళ వారం టెక్నీషియన్ హరీష్ మృతురాలి పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపామని తెలిపారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు పలువురు ఉపాధ్యాయులు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

షెడ్ల నిర్మాణానికి 70 శాతం రాయితీ

ప్రజాశక్తి - ముద్దనూరు

గొర్రెలు, మేకల షెడ్లు నిర్మాణానికి ప్రభుత్వం 70 శాతం రాయితీ ఇస్తుందని జమ్మలమడుగు డివిజన్ పశు సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మేజర్ గ్రామ పంచాయతీ డివన్ పల్లెలో ముద్దనూరు ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌ఛార్జి ఎడిఎ, పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో మంగళవారం గొర్రెలు, మేకలకు సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డివిఎహెచ్ వెంకటరామిరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవాలకు నట్టల నివారణ మందు తాపించడం వల్ల ఆరోగ్యం పెరుగుతాయన్నారు. గొర్రెల యజమానులు, కాపరులకు లాభాలు కలుగుతాయన్నారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఇందులో 70 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆసక్తిగల గొర్రెల కాపరులు గొర్రెల షెడ్లు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొండాపురం పశు వైద్యశాల అధికారి డాక్టర్ రాజశేఖర్ రాజు, సిబ్బంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : మేకలు, గొర్రెల యజమానులు నట్ల పురుగుల మందును సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, గూడెంచెర్వు పశు వైద్యశాల అధికారి డాక్టర్ జాన్ సుధాకర్ బాబు సూచించారు. మండల పరిధిలోని పి.బొమ్మేపల్లి, పొన్నతోట గ్రామాల్లో మంగళవారం వారు జీవాలకు నట్టల పురుగుల మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నట్టల పురుగుల మందులను జీవాలకు వేయడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో పశు సహాయకులు టి.క్రాంతి, మహమ్మద్ పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీతో శనగలు : ఎఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీ శనగలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. నల్లబల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో రైతులకు 25 శాతం రాయితీ శనగల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. తద్వారా వీడుపేలు రాకుండా పంటను కాపాడ కోవచ్చన్నారు. ట్రైకోడెర్మావిరిడి అనే పౌడిని కిలో విత్తనాలకు 10 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ మందును కిలో విత్తనానికి 2 ఎంఎల్ విత్తనాలకు పట్టించి శుద్ధి చేసుకోవాలన్నారు. నాయకులు రామారెడ్డి, బాబురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ దివిజ సంపతి ప్రజలకు సూచించారు. ఖాజీపేట గ్రామ సచివాలయం-2 నిర్వహించిన ఆధార్ క్యాంప్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ.. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, మొబైల్ నెంబర్ లింకింగ్, తప్పుల సవరణలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కిరణ్‌కుమార్, నరసింహులు, మహమ్మద్ రఫీ, టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ దివిజ సంపతి

ముద్దనూరు : ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. ఈనెల 23న ముద్దనూరు, 24న యామవరం, 25న కొర్రపాడు సచివాలయాల్లో ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిరునామా, వేలి ముద్రలు, ఫోటో, మొబైల్ నెంబర్ అప్డేట్, కొత్త ఆధార్ కార్డులు చేసుకోవచ్చన్నారు. మండలంలోని ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

నేడు లక్ష్మీపేటలో ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని లక్ష్మీపేట సచివాలయంలో బుధవారం ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామానుజన్ తెలిపారు. పుట్టిన తేదీ, పేరు, అడ్రస్ వంటి వాటిలో తప్పులుంటే సరి చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 24న వెదురూరు, 25న చాపాడు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

లైసెన్స్ తప్పక కలిగి ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దీపావళి పండగ సందర్భంగా పట్టణంలో టపాసుల దుకాణాలను నిర్వహించే వారు తప్పక లైసెన్స్ కలిగి ఉండాలని పులివెందుల ఆర్‌డిఒ అన్నపూర్ణ ప్రత్యూష భానుశ్రీ పేర్కొన్నారు. ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళ వారం ఆమె పట్టణంలోని టపాసుల దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టపాకాయల దుకాణాల నిర్వహించే యజమానులు అగ్నిమాపక అధికారులతో, పోలీస్ అధికారులతో అనుమతులు తీసు కోవాలన్నారు. పరి మితికి మించి టపా సులు నిల్వ ఉంచితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోసులొస్తున్న వరి పంట

వర్షాలకు నేలకొరిగిన వరి పంట - ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి

వర్షాలకు నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - వేంపల్లె

ఐదు నెలల రైతన్న కష్టం మూడు రోజుల్లో ఆవిరైంది. చేతికి వచ్చిన వరి పంట ఇటీవల కురుస్తున్న వర్షానికి నేలవాలింది. వరి పంట నాట్లు వేసినప్పటి నుండి పంట చేతికి వచ్చే దాకా కంటికి రెప్పలా కాపాడుకొంటూ వచ్చిన రైతులపై తుఫాను దెబ్బపడింది. అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా నాలుగు రోజులపాటు వర్షాలు భారీగా కురిశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే తరుణంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు అన్నదాతకు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది మొట్టమొదట మండలంలో సాగు చేసిన వరి పంటను సాగు చేశారు. రైతుల కష్టానికి ఫలితంలేకుండా పోయింది. వర్షాలు రైతులకు కంటి మీద కొనుకు లేకుండా చేస్తున్నాయి. వరి పంట నేలపాలు కావడంతో వరి గింజలు మొలకలు వచ్చి పనికిరాకుండా పోయాయని రైతుల్లో ఆందోళన నెల కొంది. ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని రైతులు విలపిస్తున్నారు. వేంపల్లె మండల వ్యాప్తంగా 1000 ఎకరాలకు పైగానే రైతులు వరి పంటను సాగు చేశారు. పాపాఘ్ని నది పరివాహక ప్రాంతాలైన ఇడుపులపాయ, వీరన్న గట్టుపల్లె, కుమ్మరంపల్లె, వేంపల్లె, ఎగువ తువ్వపల్లె, అలిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో అనేక మంది రైతులు వరి పంటను సాగుచేసి తీవ్రంగా నష్ట పోయారు. ఇప్పటికే 300 ఎకరాలకుపైగా వరి పంట నేలకొరిగింది. కొందరు కౌలు రైతులు భూ యజమానికి కౌలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు న్నారు. పెట్టుబడి బూడిదలో పోసినట్లయిందని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు పొలాల్లోకి దిగబడి పోతుం డడంతో ఉన్న పంట కూడా దక్కుతుందా లేదా అనే సందేహంలో రైతులు న్నారు. నాలుగు రోజులుగా 260 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి పంటకు మంచి ధర పలుకుతున్న తరుణంలో వర్షాల వల్ల రైతులు నిండా మునిగిపోయారు. మండల వ్యాప్తంగా వరి రైతులు రూ.2కోట్ల మేర నష్టపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈనెల 22న, 25న మరో రెండు వాయుగుండాలు ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ చేసిన హెచ్చరి కలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థి తుల నేపథ్యంలో రైతులు పదేపదే ఆకాశం వైపు పంట వైపు చూస్తున్నారు. చివరి దశలో వర్షాలు కురిస్తే నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి..

ప్రస్తుత వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వరి పంట దెబ్బతింటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరిగింది. మూడు ఎకరాలు వరి పంటను సాగు చేశాను. ఆరుగాలం కష్టించి పంటను కాపాడుకున్నా.. తీరా 20 రోజుల్లో పంట చేతికొస్తుందనగా ప్రకృతి ప్రకోపం చూపింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకుంటే అప్పుల భారం తప్పదు.

- రామకృష్ణారెడ్డి, రైతు, అలిరెడ్డిపల్లె

వరి పంటకు మొలకలు వచ్చాయి..

వరి పంట పండి చేతికి వచ్చే సమయంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. నాలుగు ఎకరాల్లో వరి పంట నేలమట్టం కావడంతో మొలకలు వచ్చి పనికి రాకుండా పోయింది. పెట్టుబడి అయినా దక్కడం లేదు. అప్పులు మిగిలాయి. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- రాజా, రైతు, అలిరెడ్డిపల్లె

కోత దశకు చేరుకున్నాయి..

ముందుగా వేసిన వరి పంట కోత దశకు చేరుకుంది. ఆలస్యంగా వేసిన వరి పొలాల్లో పంట గింజ గట్టిపడే దశలో ఉంది. నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు వారిపైరు భూమిపై పడిపోయింది. ఈ స్థితిలో ధాన్యాన్ని కోసేందుకు ఎవరు ముందుకు రారు. అంతేకాకుండా ఈ సమయంలో తుఫాన్ హెచ్చరికలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

- వెంకటనారాయణ రెడ్డి, రైతు, ఎగువ తువ్వపల్లె

ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - చాపాడు

వెలుగు ఎపిఎం డి.శ్రీధర్

మండల పరిధిలోని మహిళా సంఘాల సభ్యు లను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే లక్ష్యంగా ముం దుకు సాగుతున్నామని మండల వెలుగు ఎపిఎం శ్రీధర్ తెలి పారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ చాపాడు మం డల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో 977 మహిళా సం ఘాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ద్వారా 38 గ్రామ సం ఘాలు పని చేస్తున్నాయన్నారు. 216 ఎస్సీ సంఘాలు, 14 ఎస్టీ సంఘాలు, 391 బీసీ సంఘాలు, 277 ఓసి సంఘా లు, 79 మైనార్టీ సంఘాలు ఉన్నాయన్నారు. 977 సంఘాలలో 10,132 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. 2024-25 సంవత్సరంలో సిఐఎఫ్ పథకం ద్వారా 15 విఒ సంఘాలకు రూ.74 లక్షలు మంజూరు చేశామ న్నారు. శ్రీనిధి ద్వారా 154 ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ.3.91 కోట్లు మంజూరైం దన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా 70 సంఘాలకు రూ.11 కోట్లు పంపిణీ చేశామన్నారు. బ్యాంకుల ద్వారా సంఘా లకు అత్యధికంగా సంఘానికి రూ.20 లక్షలు అందిస్తున్నా మన్నారు. మహిళలకు వ్యక్తిగత రుణాల కింద 149 మందికి రూ.4.45 లక్షలు మం జూరు చేయించామన్నారు. కుటీర పరిశ్ర మల అభివృద్ధి ద్వారా మహిళలకు ఉపాధి కల్పిం చేందుకు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు రూపాయి వడ్డీతో రుణాలు ఇప్పిస్తు న్నామన్నారు. ప్రధానమంత్రి ఉపాధి గ్యారంటీ పథకం ద్వారా 35శాతం సబ్సిడీతో బ్యాంక్ రుణాలు మంజూరు చేయిస్తున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా రాణించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలన్నింటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగతంగా వ్యాపారాలు, కులవృత్తులు, పాడిపరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి ఉంటే బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపిల వైద్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ఆర్‌ఎంపిలు వైద్యం చేస్తున్నారని జమ్మలమడుగు సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ తెలిపారు. మంగళవారం స్థానిక క్లస్టర్ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ జమ్మల మడుగు, చుట్టుపక్కల గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లా ఆర్‌ఎంపి క్లినిక్‌లు ఏర్పడుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న క్లినికులను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల అమాయ కత్వాన్ని ఆసరా చేసుకుని ఎంబిబిఎస్ డాక్టర్ల కన్నా తలతన్నే వైద్యం చేస్తు న్నామని రోగులకు భ్రమ కల్పిస్తున్నారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా పసికందుల దగ్గర నుండి 80ఏళ్ల వృద్ధుల వరకు వారు వైద్యం చేస్తున్నారని తెలిపారు. ఇది ప్రమాదకరమో ఒకసారి ఉన్నత అధికారులు ఆలోచిం చాలని కోరారు. మందుల చీటీ రాసే దగ్గరి నుండి రక్త పరీక్షలు వరకు అన్ని వారి ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్న అధికారులు చూసీచూడనట్లు ఉండటం సరైందికాదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోగులకు ప్రభుత్వ ఆస్పత్రులపైన అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. చట్ట విరుద్ధంగా వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపిలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దస్తగిరి, భీమా, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్

అంధరహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఆర్‌డిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ప్రత్యూష

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానం ప్రోత్సహించి అంధరహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆర్‌డిఒ అన్నపూర్ణ ప్రత్యూష భానుశ్రీ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఈ మధ్య కాలంలో మరణించిన వారి నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సేవాసమితి అధ్యక్షులు రాజు చేతుల మీదుగా నేత్రదాతల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేత్రదానం ఆవశ్యకతను వివరిం చారు. అతిథులు మాట్లాడుతూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి సేవ లను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి, సర్పంచ్ మౌనిక, ఎంపి టిసి వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు కమలనాథశర్మ, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి,ఉపాధ్యాయులు, నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల విరాళం రూ.5,757

స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణం చేపడుతున్న విషయం తెలుసుకున్న నల్లపురెడ్డిపల్లి పాఠశాల విద్యార్థులు రూ.5,757 మొత్తాన్ని ఆ సమితి అధ్యక్షులు రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు విద్యార్థులకు కీతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న 2018 కాంట్రాక్టు గెస్టు ప్యాకల్టీకి టైం స్కేల్ జీతాలపై హైకోర్టు ఇచ్చిన ఇంటిరిన్ ఆర్డర్‌ను అధికారులు అమలు చేయాలని కాంట్రాక్టు గెస్టు ప్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో మంగళవారం ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, ఎఒ పెనుకొండ రవికుమార్, డైరెక్టర్ కుమారస్వామి గుప్తాకు అసోసియేషన్ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నజీర్ హుసేన్ మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. గతంలో పని చేసిన ఛాన్సలర్ కెసి రెడ్డి టైం స్కేల్ ప్రకారం జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఎగ్జిక్యూటివ్ సమావేశంలో 2018లో చేరిన కాంట్రాక్టు గెస్టు ప్యాకల్టీల జీతాలపై చర్చించాలని కోరారు. హైకోర్టు ఇచ్చిన ఇంటిరిన్ ఆర్డర్‌ను అమలు చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు గెస్టు ప్యాకల్టీ అధ్యాపకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో డిప్యూటీ డిఇఒ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఆ మేరకు వారు మంగళవారం స్థానిక డిప్యూటీ డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు మాట్లాడుతూ పులివెందుల పట్టణానికి చెందిన అంకాళమ్మపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు బిసి కులానికి చెందిన వ్యక్తి అయితే ఎస్టీ కింద తప్పుడు మార్గంలో ఉద్యోగం పొంది ఉన్నారన్నారు. ఈ విషయానికి చెందిన సమాచారాన్ని అడిగితే తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. ఆయన కార్యాలయానికి వచ్చిన సందర్భాలే లేవన్నారు. ఎక్కడికి వెళుతున్నారో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో రాయడం లేదన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో పర్యవేక్షణ పూర్తిగా కరువైందన్నారు. రెండవ శనివారం పాటించకుండా పాఠశాలలు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యాలయానికి రెగ్యులర్ సిసి లేరన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిప్యూటి డిఇఒను తక్షణమే విధుల నుండి తప్పించాలని ఓబులేసు కోరారు. కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ మహిళా నాయకురాలు చెన్నమ్మ, రాయలసీమ పరిరక్షణ సంఘం కన్వీనర్ ప్రతాపరెడ్డి, ప్రగతిశీల విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు బయన్న, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పలువురు నాయకులు

బహిరంగ ప్రకటన

గోపవరం మండలం, మడకలవారిపల్లె గ్రామ పొలం, **Sy.No.967**

1. ఫ్లాటు నెం.95 సొంటా తులసి, W/o కృష్ణ,
2. ఫ్లాటునెం.96 బండి పిచ్చమ్మ, W/o వెంకటసుబ్బయ్యలు

హైకోర్టు ఆంధ్రప్రదేశ్ పరిధిలో వున్నది. కోర్టు పరిధిలోని తగదా ఆస్తులు ఎవరైనా కొనుగోలు చేసినా, వారు సివిల్ & క్రిమినల్ చర్యలకు బాద్యులు అగుతారు. అలాంటి ఆస్తులు కొనకూడదని బహిరంగ ప్రకటన.

ఎల్.వెంకటసుబ్బమ్మ

సెల్: **9030608830.**

బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్.తులసిరెడ్డి, నాయకులు

మహిళలకిచ్చిన హామీని అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధృవకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక ఆర్‌టిసి బస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కూటమి ప్రభుత్వంపై నినాదాలు చేశారు. గత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిందన్నారు. మహిళల ఓట్ల కోసం కూటమి 3 హామీలు ఇచ్చిందన్నారు. ఇందులో ఒక్క హామీని కూడా నేరవేర్చలేదని విమర్శించారు. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీ, మిగతా హామీలను వెంటనే అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నాయకురాలు శ్యామలమ్మ, డాక్టర్ సుబ్రమణ్యం, అమర్నాథ్‌రెడ్డి, మాబు, సాదక్‌బీ, ఉత్తన్న, లక్ష్మీరెడ్డి, గురుజాల అమర్‌నాథ్‌రెడ్డి, వినయ్, అఫ్రూన్, సాయి, ఆసిఫ్త పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : కూటమి పార్టీలైన టిడిపి, బిజెపి, జనసేన మహిళలను నమ్మించి మోసం చేశాయని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ అన్నారు. ఉచిత బస్సు ప్రయా ణం హామీ ఇచ్చి అధికారంలోకొచ్చి ఐదు నెలలవుతున్నా ఇంతవరకు నిలబెట్టు కోలేకి పోయినందుకు నిరసనగా మంగళవారం ప్రొద్దుటూరు నుండి ఎర్రగుంట్ల వరకు ఆర్టీసి బస్సులో ప్రయాణం చేసి మహిళలతో కలసి టికెట్లను చూపిం చారు. కాంగ్రెస్ నాయకులు అలీ, సుజీర్, ఖలందర్, బాబా పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - చాపాడు

అవసరమయ్యే వరకే ఎరువులు వాడాలని కెవికె శాస్త్రవేత్త వీరయ్య సూచించారు. వరిలో సోకే రెక్కల పురుగు, దోమతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండల పరిధిలోని ఖాదరపల్లి, పల్లవోలు గ్రామాల్లో మంగళవారం ఎఒ మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త వీరయ్య రైతులకు ప్రస్తుతం వరి పొలాల్లో సోకే చీడపీడల గురించి, వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రెక్కల పురుగు, దోమ నివారణకు అసిఫెట్ మందు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామమోహన్, జైనుల్లా గ్రామ వ్యవసాయ సహాయకులు గిరిధర్‌రెడ్డి, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట : నూతన వంగడాల సాగు అలవర్చుకోవాలని కెవికె శాస్త్రవేత్త మహేష్‌బాబు పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కె.రాజుపల్లిలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ.. మారుతున్న జీవన విధానంలో మన అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల్లో నూతన వంగడాలు ఆవిర్భవి స్తున్నాయన్నారు. రైతు శిక్షణా కేంద్ర వ్యవసాయాధికారి నాగభూషణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు నూతన పంట విధానాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు వంటి అంశాలను తెలిపారు. ఎఒ నవంత్ బాబు గ్రామ రైతు శంకర్‌రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న బ్లాక్ రైస్ పొలాన్ని అధికారులు, రైతులతో పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

లింగాల : దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. మండల కేంద్రంలోని లింగాలలో మంగళవారం ఇంటింటా మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జర్వం ఉన్న వారికి రక్తపూతలు సేకరించాలన్నారు. వారంలో రెండు సార్లు పరీక్షలు చేయాలన్నారు. మలేరియా లక్షణాలు కనిపిస్తే గ్రామంలో సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శివరాం, పిహెచ్ఎన్ కుసుమ కుమారి, సూపర్‌వైజర్ హషియా, చంద్రకళ పాల్గొన్నారు

గ్రామసభలో 35 దరఖాస్తులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని దేవతాపురంలో మంగళవారం నిర్వహించిన భూ సర్వే గ్రామ సభలో 35 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ హరిబాబు తెలిపారు. గతంలో జరిగిన భూ సర్వేలో అనేక తప్పులు దొర్లాయని, వాటిని పరిష్కరించాలంటూ రైతులు వినతిపత్రాలు ఇచ్చారన్నారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ షరీఫ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. కడప ఎస్పీ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తులసి నాగప్రసాద్ వ్యక్తిగత సెలవుపై వెళ్లారు.

వాహనాలు తనిఖీ, జరిమానా : ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ షరీఫ్ సూచిం చారు. మండలంలోని పాతపల్లె క్రాస్ వద్ద మంగళవారం ఆయన వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డు లేని వారికి జరిమానా విధించారు.

మానిటరింగ్ కమిషన్‌ను పునరుద్ధరించాలి

ప్రొద్దుటూరు : ప్రయివేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న టీచర్స్, లెక్చరర్స్‌కు జీవనాడి అయిన ఎపి స్కూల్స్ ఎడ్యుకేషన్ రెగ్యు లేటరీ మానిటరింగ్ కమి షన్‌ను పునరు ద్ధరించాలని రాష్ట్ర ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 28మే 2020న చట్టం చేసిన ఈ కమిషన్‌ను ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలు వారికున్న ఆర్థిక బలంతో అణచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కమిషన్ పుణ్యమా అని ప్రయివేట్ టీచర్లకు మంచి జీతంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ దక్కుతా యన్నారు.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.P.No.62/2023

O.S.No. 106/2017

1. దొంతి రెడ్డి వెంకట సుబ్బారెడ్డి, తండ్రి శ్రీరాములు రెడ్డి, వయస్సు 48 సంవత్సరాలు, వ్యవసాయం, ఎత్తపువారి కాలనీ, జమ్మలమడుగు టౌన్ & మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా. **...పిటిషనరు/డి.హెచ్.ఆర్**

Vs

TO

వీరిదండ్ల శాంతమ్మ, భర్త రామయ్య, వయస్సు సుమారు 56 సంవత్సరాలు, నాగలకట్ట వీధి, జమ్మలమడుగు టౌన్ & మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

...రెస్పాండెంట్/ జె.డి.ఆర్

నోటీసు(ఆర్డర్ 21 రూలు 34 సిపిసి).

16-09-2014 తేదీన షెడ్యులు దాఖలా ఆస్తికి సంబంధిం చి రెస్పాండెంట్ అయిన నీవు, పిటిషనరు పేరున వ్రాయించి న విక్రయ అగ్రిమెంట్ ను అనుసరించి డిక్రీ పొంది, సదరు డిక్రీని అనుసరించి రిజిస్టర్ దస్తావేజు వ్రాయించ కోరుచూ, పిటిషనరు నీ పైన దాఖలు చేసిన పిటిసన్ మీ హాజరు కొరకు 25.10.2024వ తేదీకి వాయిదా వున్నది. కావున ఇందుకు మీకు ఎవైన ఆక్షేపనలు వున్నా యెడల ఆ రోజు ఉదయం గం.10-30 ని.లకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకోనేది. లేనంతట విషయం మీ పరోక్షంలో తీర్మానించబడునుయని తెలియచేయటమైనది.

SCHEDULE

Property situated in YSR kadapa - District, Jammalamadugu Sub-District, Jammalamadugu mandal, Jammalamadugu town & mandal, in S.No.459 pyki Ac.0.03 cents, voorimundara chenu, measuring east-west: 19 yards, North-South:7 1/2 yards.

Bounded by: East-public rasta, West- land of T.B.Nagabhushan Rao, North- Hut of T.B.Dasu, South- House of T.B.Lakshmi Narasaiah.

In the above site there is also a south faced cement rekula vasara having old D.No.22/86 which ad measures east-west: 48 feet, North-South: 15 1/2 feet.

వాయిదా: 25.10.2024

//రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వు మేరకు//

ఎం.ఎస్. చంద్రశేఖర్ రెడ్డి,

వాదుల తరపు అడ్వొకేట్,

జమ్మలమడుగు.